నేటి నుంచే బతుకమ్మ సంబురాలు

- అమావాస్యకు రెండురోజుల ముందే కూకట్‌పల్లిలో వేడుకలు ప్రారంభం
- తొమ్మిది రోజులపాటు కోలాహలంగా సంబురాలు
- పిల్లాపాపలతో వేడుకల్లో పాల్గొననున్న మహిళలు

బతుకమ్మ ఆడుతున్న మహిళలు(ఫైల్)

బాలానగర్, సెప్టెంబర్ 29: బతుకమ్మ (పూల) పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక. తొమ్మిదిరోజుల పాటు ప్రకృతిలోని పూలను తెచ్చి బతుకమ్మగా పేర్చి అందులో గౌరమ్మను ప్రతిష్ఠించి ఆడుపడుచులంతా భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తూ ఆట పాటలతో సంబురాలు జరుపుకోవడమే బతుకమ్మ పండుగ ప్రత్యేకత. బతుకమ్మ పూజలలో భాగంగా ఆడపడుచులంతా ఒకచోట చేరి బతుకమ్మ ఆడుతూ బంధాలు అనుబంధాలను గుర్తు చేస్తూ శివుడు, రాముడు, సీతాదేవి, అమ్మవార్ల విశిష్టతను పలువురికి తెలియజేయడం కోసం పాటలు పాడటం ఆనవాయితీ. పిల్లాపాపలంతా చల్లంగా చూడు తల్లీ అంటూ బతుకమ్మ(గౌరిదేవి)ని వేడుకోవడం కోసం భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడటం సంప్రదాయంగా వస్తుంది. గతంలో పల్లెల్లో బతుకమ్మ పండుగ సంబురం సందడిగా ఉండేది. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత బతుకమ్మ వేడుక విశ్వవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాందించింది. ఆశ్వయుజ మాసం అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో సంబురాలు మొదలై తొమ్మిది రోజుల తర్వాత సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి అందులో గౌరమ్మను ప్రతిష్ఠించి నైవేద్యాలు సమర్పిస్తూ మహిళలంతా కలిసి సంబురాలు జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ చివరి రోజున ఘనంగా వేడుకలు నిర్వహించి గౌరమ్మలతో కూడిన బతుకమ్మలను నిమజ్జనం చేయడంతో బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.

నేటి నుంచే బతుకమ్మ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగ ఆశ్వయుజ అమావాస్య రోజున ప్రారంభమవుతాయి. కానీ కూకట్‌పల్లి గ్రామంలో అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం.. అమావాస్యకు ఒకరోజు ముందు రోజునే బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడం ప్రత్యేకతను సంతరించుకున్నది. అమావాస్య రోజున పసుపు కుంకుమను బయటకు తీసుకుపోవద్దని.. నాటి పెద్దలు చెప్పి ఆచారాన్ని పాటిస్తూ ఒకరోజు ముందే బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారు. కాగా, ఈ యేడాది అమావాస్య అక్టోబర్ 2న ఉండగా, సంప్రదాయం ప్రకారం.. అక్టోబర్ 1వ తేదీన జరుపుకోవాల్సి ఉండగా, మంగళవారం పసుపు, కుంకుమ బయటికి వెళ్లొద్దని గ్రామ పెద్దల నిర్ణయం మేరకు సెప్టెంబర్ 30వ తేదీ సోమవారం రోజున బతుకమ్మ వేడుకలు ప్రారంభించాలని నిర్ణయించారు.

బొడ్డెమ్మతో పండుగ ప్రారంభం..

బతుకమ్మ పండుగకు ఐదురోజుల ముందే బొడ్డెమ్మ పండుగతో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. ప్రధానంగా బతుకమ్మను ఐదు రకాల పూలతో బతుకమ్మను పేరుస్తారు. వాటిలో తంగేడు, గుమ్మడి పూలు, లేదా ఆకులు, గునుగు, బంతి, చామంతి పూలతో బతుకమ్మను పేర్చుతారు. అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు షురూ అవుతాయి. రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవరోజు నానబియ్యం బతుకమ్మ, ఐదోరోజు అట్ల బతుకమ్మ, ఆరోరోజు అలిగిన బతుకమ్మ, ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవరోజు వెన్న ముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మగా పూజలు చేస్తూ గౌరమ్మను పూజిస్తారు. ఐదు రకాల పండ్లు తొమ్మిది రోజులపాటు రోజుకు ఒక వెరైటీగా అమ్మవారికి నైవేద్యంగా పెట్టి పూజలు చేసి నిమజ్జనం చేయడం సంప్రదాయంగా వస్తుంది.

'బతుకమ్మ'ను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే కృష్ణారావు

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచే బతుకమ్మ వేడుకలు విజయవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం మొదటి బతుకమ్మ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బతుకమ్మ పండుగ పూర్తి అయిన తర్వాత విజయదశమి రోజున కూకట్‌పల్లి రామాలయం వద్ద సాయంత్రం 5.30 గంటలకు జమ్మిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలందరికీ బతుకమ్మపండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కూకట్‌పల్లిలో జరిగే బతుకమ్మ వేడుకల్లో గ్రామ మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు నేడు ఉచిత వైద్య శిబిరం

బాలానగర్, సెప్టెంబర్ 29: కూకట్‌పల్లి జోన్ పరిధిలోని స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం.. పోషకాహారంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో 3,200 మంది పని చేస్తున్నారని తెలిపారు. వారందరికీ ఉపయోగపడేలా 9 ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్మికుల ఆరోగ్యం, పరిశుభ్రతను పెంపొందింపజేయడానికి నాణ్యమైన వైద్య పరీక్షలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జడ్సీ అపూర్వ చౌహాన్ హెచ్ఎంటీ శాతవాహన కాలనీలో ఏర్పాటు చేయనున్న సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నిజాంపేట్ మేయర్‌కు బతుకమ్మ ఉత్సవాలకు ఆహ్వానం

దుండిగల్, సెప్టెంబర్ 29: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డిని ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని మధురానగర్‌కు చెందిన సీనియర్ నాయకులు, విష్ణువర్ధన్‌రావు కాలనీవాసులు, మహిళలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టడంతోపాటు ప్రకృతితో మమేకమయ్యే ఏకైక సంబురం బతుకమ్మ పండుగ అని, వేడుకలు ప్రజలందరూ కలిసిమెలసి సంతోషంగా జరుపుకోవాలని మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు.

విజయవంతంగా స్కాలర్‌షిప్ టెస్ట్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29:సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలరో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత మాట్లాడుతూ.. ఈ టెస్టులో సుమారు 2500 మంది హాజరయ్యారని, టాప్ 10 విజేతలకు తమ అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇవ్వనున్నట్టు జరుగుతుందని తెలిపారు.

పుట్టుకతోనే కాక మధ్యలో వినికిడి లోపం రావచ్చు

మాదాపూర్, సెప్టెంబర్ 29: వినికిడి లోపం పుట్టుకతో మధ్యలో ఎప్పుడైనా రావచ్చని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ప్రపంచ చెవిటి అవేర్నెస్ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని న్యూ గుడ్ షెఫర్డ్ చెవిటి, మూగ పాఠశాలలోని ప్రపంచ చెవిటి అవేర్నెస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... వినికిడి లోపం పుట్టుకతో గానీ, మధ్యలో గానీ రావచ్చన్నారు. వినికిడి లోపం తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉండవచ్చని అన్నారు. వినికిడి లోపాలకు గల కారణాలు జన్యుశాస్త్రం, వృద్ధాప్యం, పెద్ద శబ్దాలకు గురికావడం, అంటు వ్యాధుల వలన, పుట్టుకతో వచ్చే సమస్యల వలన చెవికి గాయాలు అవడం, టాక్సిన్స్ వలన, వినికిడి లోపం రావచ్చని అన్నారు. పరీక్షలో కనీసం 25 డేసీబుల్స్ వినలేదని గుర్తించినప్పుడు వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఇందులో స్మీతా డెంటల్ వైద్య నిపుణులు తదితరులు ఉన్నారు.

ప్రపంచ చెవిటి అవేర్నెస్ వారోత్సవాలను పురస్కరించుకొని చెవిటి, మూగ పాఠశాలలో పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

విజయవాడ వెళ్లే ప్రయాణికులకు శుభవార్త

రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 29: ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా టీఎస్ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తున్నదని రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పటాన్‌చెరువు, బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు ఆమె శుభవార్తను తెలిపారు. బీహెచ్ఈఎల్ డిపో నుంచి నూతనంగా ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ వెళ్లేందుకు గాను నూతనంగా రెండు ఈ-గరుడ బస్సులను సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆమె వివరించారు. ఈ నూతన బస్సులు రామచంద్రాపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట్ క్రాస్ రోడ్స్, హౌసింగ్ బోర్డు మీదుగా జేఎన్టీయూ, రైతు బజార్, మలేషియా టౌన్‌షిప్, శిల్పారామం, సైబర్ టవర్స్, మై హోమ్ భూజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడ వెళ్లుతాయన్నారు. దీంతో విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ జామ్ సమస్య నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు, 10.30 గంటలకు రామచంద్రాపురం నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అలరించిన నాట్య ప్రదర్శన

కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో విశేషంగా అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సుమ, ప్రభ బృందంచే భరత నాట్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. పలువురు నాట్య కళాకారులు మూషిక వాహన, అష్టలక్ష్మి, నోటు స్వర, రంగపూజ నృత్య, మహలక్ష్మి అష్టకం, స్వరజతి, ఆనంద నర్తన గణపతిమ్, గణేష పంచరత్న, తిల్లాన వంటి అంశాలకు చెందిన సంకీర్తనలకు నాట్య ప్రదర్శనలు చేశారు. *– మాదాపూర్, సెప్టెంబర్ 29*

ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలకు కృషి

మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఆదివారం శంభీపూర్ కార్యాలయంలో శంభీపూర్‌కృష్ణను మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించడంతో పాటు వాటిని పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. *– దుండిగల్, సెప్టెంబర్ 29*

కీసరలో క్రికెట్ పోటీలకు కూకట్‌పల్లి జోనల్ విద్యార్థులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో కీసర మండలంలోని టీజీఆర్ స్పోర్ట్స్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్న సందర్భంగా కూకట్‌పల్లి జోనల్ క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు పోటీలో తలపడనున్నారు. సోమవారం అండర్-14 విభాగంలో కూకట్‌పల్లి జోనల్ విద్యార్థులు పాల్గొననున్నారు. జోనల్ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా క్రీడలకు ఎంపిక చేస్తారని జోనల్ క్రీడా కార్యదర్శి యాదయ్య పేర్కొన్నారు. *– బాలానగర్, సెప్టెంబర్ 29*

మహిళా మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధిగా సరితారావు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 29: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ నుంచి తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. సరితారావు గతంలో మేడ్చల్ జిల్లా రూరల్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీకి పలు సేవలు అందించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలను సంఘటితం చేయడంలో క్రియాశీలకంగా పని చేయడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ గుర్తించిందని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీ విగ్రహం, పరిసరాలు శుభ్రపరిచి..

గాంధీ విగ్రహాన్ని శుభ్రంచేసి రంగులు వేస్తున్న బీజేపీ నేతలు

దుండిగల్, సెప్టెంబర్ 29: నిజాంపేటలోని మహాత్మాగాంధీ విగ్రహ సమీపంలోని పరిసరాలను స్థానిక బీజేపీ నేతలు ఆదివారం శుభ్రపరిచి రంగులు అద్దారు. గ్రామ కమిటీ బీజేపీ అధ్యక్షులు భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు, నేతలు గాంధీజీ విగ్రహాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. అహింసను ఆయుధంగా చేసుకుని ఆంగ్లేయులపైన భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన గాంధీ విగ్రహం, పరిసర ప్రాంతాలల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటం, చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి సతీశ్ కృష్ణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సోషల్ మీడియా కన్వీనర్ కూన ప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు చేరిన రామన్న-వెంకన్న మహా పాదయాత్ర

గొల్లపూడి వీరేంద్ర చౌదరిని సత్కరించి అభినందనలు తెలిపిన ప్రముఖ యోగా శిక్షకులు పుట్ట వినయ్‌కుమార్ గౌడ్

మాదాపూర్, సెప్టెంబర్ 29: త్రివేణి విద్యా సంస్థల చైర్మన్, గొల్లపూడి వీరేంద్ర చౌదరి 2004 ఏడాది నుంచి ప్రతీ లీపు సంవత్సరం(నాలుగు సంవత్సరాలకు ఒకసారి) భద్రాచల రామయ్య సన్నిధి నుంచి తిరుమల శ్రీవారి సన్నిధికి పాదయాత్ర సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీ పౌర్ణమి నుంచి 7వ సారి మహా పాదయాత్రను మొదలుపెట్టి ఒంగోలు సమీపంలోని వారి స్వగ్రామమైన దొడ్డవరానికి చేరుకున్నారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లికి చెందిన ప్రముఖ యోగా శిక్షకులు పుట్ట వినయ్‌కుమార్ గౌడ్ త్రివేణి సిబ్బందితోపాటు పాఠశాల అధినేత గొల్లపూడి వీరేంద్ర చౌదరిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గడీల శ్రీధర్ గౌడ్, త్రివేణి సీఆర్ఓలు సాయి నర్సింహారావు, వెంకట్రావ్, ఏసీఆర్ఓలు నరేశ్, సతీశ్, ఇన్‌చార్జిలు రామకృష్ణ, కోటేశ్వర్ ఉన్నారు.

3 నుంచి అలరించనున్న దాండియా మస్తీ-2024

కొండాపూర్‌లోని మాయా లగ్జరీ కన్వెన్షన్ సెంటర్‌లో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దాండియా మస్తీ-2024 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా దేవర ఫేం నటీ బిందు నూతక్కి విచ్చేసి జాంటీ హ్యాట్ ఈవెంట్స్ ఫౌండర్ దీపికా బాజిరెడ్డి హాజరై ఘనంగా నిర్వహించారు. ఇందులో డీజే ప్రదర్శనలు, ఆకర్షణీయమైన ప్రత్యక్ష ధోల్ ప్రదర్శన, విభిన్న శ్రేణి ఫుడ్ స్టాల్స్ నగర యువతకు ప్రత్యేకంగా ఆకర్షించనున్నాయి. ఈ కార్యక్రమానికి నగర యువత పెద్ద సంఖ్యలో విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. *– మాదాపూర్, సెప్టెంబర్ 29*

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో అపోలో హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి హాజరై ప్రారంభించి మాట్లాడాఇందులో బీపీ, షుగర్, టూడి ఈకో, ఎత్తు, బరువులను పరీక్షించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ నర్సింగరావు, గచ్చిబౌలి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భరత్ గౌడ్, శ్రీ కృష్ణ యూత్ ప్రెసిడెంట్ అభిషేక్ గౌడ్, రాములు, కృష్ణ యాదవ్, అరవింద్ ఉన్నారు. *–మాదాపూర్, సెప్టెంబర్ 29*

అసంపూర్తి పనులు త్వరలో పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాను టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అర్ధరాత్రి పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్, సెప్టెంబర్ 29: అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలో పూర్తి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని భానుటౌన్‌షిప్‌లో రూ.30లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం అర్ధరాత్రి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హఫీజ్‌పేట్ దశ దిశను మార్చడం జరిగిందన్నారు. డివిజన్‌లోని అన్న కాలనీలోనూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రోడ్డు నాణ్యతను పరిశీలించి అధికారులకు దిశ నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడం కొరకు నాణ్యమైన రోడ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భానుటౌన్‌షిప్ అధ్యక్షుడు షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ ఇలియాస్, రాంనాథ్, బీంరావు, పవన్ గౌడ్, అమర్ దీప్ అశోక్ తదితరులు ఉన్నారు.

సొసైటీ భవనను సద్వినియోగం చేసుకోవాలి

అయ్యప్ప సొసైటీ ఆఫీస్ భవన నిర్మాణం పనులను త్వరితగతిన చేపట్టి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో సొసైటీ ఆఫీస్ భవనాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గాంధీ స్థానిక నాయకులతోపాటు కాలనీ ప్రజలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫీస్ కార్యాలయాన్ని స్థానిక ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి, సంక్షేమం కొరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆఫీస్ భవనంలో సభలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవన నిర్మాణం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస యాదవ్, సొసైటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కేవీ రావు, రత్నం తదితరులు ఉన్నారు.

– కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్‌లో రూ.12.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు.

కుటుంబసభ్యుల చెంతకు వృద్ధుడు

పోలీసులు చొరవతో తప్పిపోయిన వృద్ధుడు కుటుంబం చెంతకు చేరాడు. జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌లో నివాసముండే నవీన్ ప్రైవేటు ఉద్యోగి. నల్లగొండ నుంచి పది రోజుల కిందట అతని తండ్రి రామయ్య చూసేందుకు వచ్చాడు. ఈనెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయాడు. నవీన్ పోలీసులను ఆశ్రయించగా.. సాంకేతిక సాయంతో గాలించారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని రామయ్య ఆచూకీ కనుక్కుని ఆదివారం కుమారుడికి అప్పగించారు. *– జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 29*

ప్రైవేట్ నిర్మాణాలకు ప్రభుత్వ స్థలం నుంచి దారి

- పట్టించుకోని అధికారులు
- రోడ్డు కోసం 600 గజాల ప్రభుత్వ భూమి కబ్జా!
- గతంలోనే జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌ల కోసం ప్రభుత్వ భూమిని దారిగా వినియోగిస్తున్న దృశ్యం

దుండిగల్, సెప్టెంబర్ 29:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రామం సర్వే నం.165,126లో ఓ నిర్మాణదారుడు రోడ్డు అనుమతులు పొందకుండానే అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం చేపట్టాడు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి దొడ్డిదారిన ఎన్ఓసీలు తెచ్చుకుని సజావుగా పని సాగిస్తున్నాడని, సదరు అపార్ట్‌మెంట్‌ల వద్దకు చేరుకోవాలంటే సర్వే నం.109లోని ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వెళ్లాలని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందుకోసం సర్వే నం.109లోని ప్రభుత్వ భూమిలో 600గజాల స్థలాన్ని సైతం కబ్జా చేసినట్లు పేర్కొంటున్నారు. సర్వే నం.126లో కొనుగోలు చేసిన 203 గజాల స్థలాన్ని అనుమతుల కోసం చూపి, ప్రభుత్వ స్థలంలో ఏకంగా దారిని ఏర్పాటు చేసుకుని బిల్డింగ్ మెటీరియల్‌ని తరలిస్తున్నాడు. గతంలో ప్రభుత్వ భూమి మీదుగా ఎవరు వెళ్లకుండా అటు రెవెన్యూ, ఇటు మున్సిపాలిటీ అధికారులు ట్రెంచింగ్ కొట్టినప్పటికి, ఖాతరు చేయకుండా వాటిని తొలగించి యధావిధిగా దారిని వినియోగిస్తున్నాడంటున్నారు. తప్పుడు పత్రాలు చూపి హెచ్ఎండీఏ నుంచి అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు పొందడంతోపాటు ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, రోడ్డుకి అనుమతులు పొందకుండానే సదరు నిర్మాణదారుడు అపార్ట్‌మెంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి పనులు కొనసాగిస్తుండటం స్థానికులను విస్మయానికి గురి చేస్తుంది. రెవెన్యూ,ఇరిగేషన్ శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతోనే నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయంటున్నారు.నిజాంపేట్ గ్రామం సర్వే నం.165లో1.95 ఎకరాల స్థలంలో నిర్మాణాల కోసం సర్వే lo.126లోని ప్లాట్ నం.41లో 203 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టిన బిల్డర్ దానికి కేవలం రికార్డుల కోసమే చూపించి, దారి కోసం మాత్రం ప్రభుత్వ స్థలాన్ని వినియోగించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా సర్వే నం.109, ప్రభుత్వ స్థలంలోని 600 గజాలను తనకు సంబంధించిన 165 సర్వే నంబర్‌లో (కబ్జా చేసి)కలిపేసుకుని బహుళ అంతస్థుల నిర్మాణాలు నిర్మిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణంపై గతంలోనే చర్యలు తీసుకోవాలని స్థానిక బీజేపీ నేతలు పలుమార్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు సైతం చేశారు. నిర్మాణదారుడికి స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల నుంచి పూర్తి సహకారం ఉండటంతోనే సదరు అపార్ట్‌మెంట్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి సదరు నిర్మాణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వరల్డ్‌హార్ట్ డేను పురస్కరించుకుని అంబీర్‌లేక్ వాకర్స్ అసోసియేషన్, లైఫ్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతినగర్‌లోని లేక్‌వ్యూ కాలనీలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్థానికుల నుంచి చక్కని స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానికులకు జనరల్ మెడిసిన్‌తోపాటు కార్డియాలజీ, దంత, నేత్ర, పెడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ వంటి పరీక్షలను నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. యశోద హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లైఫ్‌చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.ప్రశాంత్‌కుమార్, అంబీర్‌లేక్ వాకర్స్ అసోసియేషన్ వలంటీర్స్ సాంబశివరావు, శాస్త్రీ, గోపాలకృష్ణరాజు, నరసింహరాజు, విజయ్‌సింహ, చక్రధరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. *– దుండిగల్, సెప్టెంబర్ 29*

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన మిథిలానగర్ వాసులు

దుండిగల్, సెప్టెంబర్ 29:ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)అన్నారు. జీహెచ్ఎంసీ పరిధి, (125)గాజులరామారం డివిజన్ పరిధిలోని, మిథిలానగర్ కాలనీవాసులు ఆదివారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కాలనీలోని పలు సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.కాలనీ ప్రజలకు ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు మద్ది నారాయణరెడ్డి, అరుణ్‌కుమార్, రాజా, హరీష్ కుమార్, పూర్ణచంద్రరావు, వేణు, రాము, సందీప్, మౌలి తదితరులు పాల్గొన్నారు.